క్లుప్తంగా

మూగజీవాలకు నీటి తొట్టెలు నిర్మిస్తాం

పొదిలి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు తాగునీరు అందించేందుకు మండలంలో 51 నీటి తొట్టెల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఉన్నగురువాయుపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ తెలిపారు. వేసవి కాలం కావడంతో గొంతు తడుపుకొనేందుకు ప్రజలు, పశువులు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. పొదిలి మండలంలోని 16 పంచాయతీల్లో పశువుల తాగు నీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వ సాయంతో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో జన సంచారం లేని ప్రదేశాల్లో తొట్ల నిర్మాణం చేపడతామన్నారు.

14న రక్తదాన శిబిరం

బేస్తవారిపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14వ తేదీన కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బేస్తవారిపేట పీహెచ్‌సీ సీహెచ్‌ఓ పీ హబీబ్‌ఖాన్ తెలిపారు. మార్కాపురం జిల్లా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్త సేకరణ జరుగుతుందన్నారు. రక్తదానం చేసేవారు 8374837572, 9592081140ను సంప్రదించాలని సూచించారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోదరుడు రామిరెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 11 నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు అందరూ హాజరుకావాలని కమిటీ సభ్యులు కోరారు.

12న ముస్తాఫావలి స్వామి ఉరుసు

గిద్దలూరు రూరల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఈ నెల 12వ తేదీన ముస్తాఫావలిస్వామి 83వ ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న గంధ పూజ మహోత్సవం, 13న జెండా ఉరుసు మహోత్సవం, కోలాట నృత్య ప్రదర్శనలు, భక్తులకు అన్నదానం చేయనున్నట్లు వివరించారు. ఉరుసు మహోత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

21న గంగా భవాని దేవస్థాన శిఖర మహోత్సవం

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లె గ్రామంలో గంగా భవాని ఆలయ శిఖర మహోత్సవం ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న పూజలతోపాటు రాత్రికి మ్యూజికల్ నైట్, 22న అభిషేకాలు, హోమాలు, గ్రామోత్సవం, 23న విగ్రహ, కలశ శిఖర ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు వివరించారు. మూడు రోజులపాటు భక్తులకు అన్నసంతర్పణ చేస్తామని తెలిపారు.

ఆరుగురు బైండోవర్


నవోదయంపై సమావేశంలో పాల్గొన్న అధికారులు

బేస్తవారిపేట: మండలంలోని కోనపల్లె, ఖాజీపురానికి చెందిన ఆరుగురిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. నాటుసారా తయారీదారులు, బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నవారిని బేస్తవారిపేట తహసీల్దార్ జితేంద్రకుమార్ వద్ద బైండోవర్ చేయించినట్లు చెప్పారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నవోదయం 2.0పై మండల కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ జితేంద్రకుమార్

బేస్తవారిపేట: సచివాలయాల్లో, మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులపై అధిక నగదు వసూలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జితేంద్రకుమార్ హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, మీసేవ నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. అన్ని రకాల సేవలకు సంబంధించిన ఫీజు పట్టికను నోటీస్ బోర్డులో ఏర్పాటు చేయాలని సూచించారు. అర్జీదారులకు ఫీజు రిసిప్ట్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్‌లో అర్జీలను అప్‌లోడ్ చేసేటప్పుడు ధ్రువపత్రాలను సరిచూడాలని చెప్పారు. కార్యక్రమంలో డీటీ షేక్ సలీమ్ బాషా పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల బరితెగింపు

- ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జా
- తర్లుపాడులో పంచాయతీ స్థలం ఆక్రమించి భవన నిర్మాణం
- బేస్తవారిపేట మండలం చింతలపాలెంలో ప్రభుత్వ భూమికి కంచె
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు


చింతలపాలెంలో చదును చేసి రోడ్డుకు అడ్డంగా పాతిన కర్రలు


తర్లుపాడులో పంచాయతీ మరుగుదొడ్లు కూల్చి నిర్మిస్తున్న భవనం

తర్లుపాడు/బేస్తవారిపేట: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది మొదలు తెలుగు తమ్ముళ్లు బరితెగిస్తున్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ అధికార యంత్రాంగానికే సవాల్ విసురుతున్నారు. కబ్జారాయుళ్లపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఆచితూచి స్పందిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన తర్లుపాడులో సుమారు 40 లక్షల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలంపై ఓ టీడీపీ నాయకుడి కన్ను పడింది. తర్లుపాడు రెవెన్యూ సర్వే నంబరు 361/1లో 48 ఎకరాల గ్రామ కంఠం భూమి ఉంది. గ్రామస్తుల కోసం 40 ఏళ్ల క్రితం పంచాయతీ నిధులతో గ్రామ కంఠం భూమిలో మరుగుదొడ్లు నిర్మించారు. కాలక్రమేనా అవి శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని ఎవరూ వినియోగించడం లేదు. అయితే సదరు భూమిపై కన్నేసిన ఓ ఆక్రమార్కుడు శిథిలమైన మరుగుదొడ్లను తొలగించి భవన నిర్మాణానికి పూనుకున్నాడు. విలువైన పంచాయతీ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీకి చెందిన భూమిని ఆక్రమార్కుడి చెర నుంచి కాపాడి గ్రామ అవసరాలకు వినియోగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భూమి కబ్జా చేసి.. దారి అడ్డగించి..

బేస్తవారిపేట మండలంలోని చింతలపాలెం రెవెన్యూ పరిధిలో కంభం చెరువు కట్టకు వెళ్లే దారిలో ఓ వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించాడు. ప్రభుత్వ భూమికి ఆవల ఉన్న పొలాలకు దారి లేదంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. మట్టి తోలి జేసీబీతో పొలం చదును చేసుకుని దారి లేకుండా చేశాడు. రైతులు పొలాల్లోకి వెళ్లకుండా కర్రలు పాతాడు. సర్వే నంబర్ 302లో 86 సెంట్ల స్థలం ప్రభుత్వ కాలువ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. ప్రభుత్వ కాలువ భూమిని పూర్తిగా ఆక్రమించడమే కాకుండా కిందవైపున పొలాలకు వెళ్లేందుకు వీల్లేకుండా కంచె ఏర్పాటు చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ భూమి వెనుకవైపున శ్మశానం ఉంది. దహన సంస్కారాలకు వెళ్లాలంటే కాలువ గట్టుపై వెళ్లాల్సిన దుస్థితి. రెవెన్యూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పొలాలకు వెళ్లేందుకు కనీసం దారి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, ప్రజలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఏరియా కార్యదర్శి అందె నాసరయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సీపీఐ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు పేదలతో కలిసి ర్యాలీ నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కాపురం పట్టణంలో అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వడంతోపాటు పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశిం మాట్లాడుతూ.. ఇళ్ల పట్టాల కోసం వార్డుల వారీగా సర్వే నిర్వహించి పేదలను గుర్తించాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని, అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొనకనమిట్ల, పొదిలి మండలాల సీపీఐ నాయకులు కేవీ రత్నం, వీరయ్య, పట్టణ కార్యదర్శి చిత్తారి పెద్దన్న, దుప్పట్ల కాశయ్య పాల్గొన్నారు.

వేడుకగా రాములోరి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో సీతారాములు


ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలోని సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో సీతారాములవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామివారి రథోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని హనుమంత వాహనంపై ఊరేగించారు. ఉభయదాతలు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామోత్సవంలో కళాకారుల వేషధారణలు భక్తులను అలరించాయి.

ఆంజనేయా పాహిమాం

శ్రీరామ నవమిని పురస్కరించుకుని గొట్లగట్టు అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి వారికి అభిషేకాలు, ఆకు పూజలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు పూజా కార్యక్రమంలో పాల్గొని నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్

- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ


సమీక్షలో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ

మార్కాపురం: మే 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించే కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని మార్కాపురం కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎం.బాలాజీ పోలీసు అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని, దీనిపై అవగాహన కల్పించాలని, ఎవరైనా రాజీపడేందుకు ఇష్టపడితే వారితో మాట్లాడి లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందేందుకు సహకరించాలన్నారు. బుధవారం కోర్టులో జరిగిన పోలీసు అధికారుల సమావేశంలో ఆయన లోక్ అదాలత్ నిర్వహణపై చర్చించారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి, ఎక్సైజ్ ఎస్సై గోపాలకృష్ణ, మార్కాపురం టూటౌన్ ఎస్సై రాజమోహన్, రూరల్ ఎస్సై అంకమరావుతోపాటు సబ్‌డివిజన్‌లోని పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

కాటమరాజు దేవస్థానం అభివృద్ధికి కృషి


నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన వేమూతల కాటమరాజు దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గుమ్మా గంగరాజు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మార్కాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ.. అందరి సహకారంతో గుడి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పీఎల్‌పీ యాదవ్ మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం రహదారి నిర్మించాల్సి ఉందన్నారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుమ్మా బాలనాగయ్య, పిన్నిక చక్రపాణి, ఒంటేరు నాగేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ క్షేమమే పోషణ్ పక్వాడా లక్ష్యం


మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి


సూచనలిస్తున్న వైద్యాధికారి సాయిచరణ్‌తేజ్

గిద్దలూరు రూరల్: పోషణ్ పక్వాడాపై గర్భిణులకు అవగాహన కల్పించాలని స్థానిక సీడీపీఓ బి.జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని నల్లబండ బజారులో గల అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం పోషణ్ పక్వాడాపై ఆమె మాట్లాడారు. గర్భిణీ దశ నుంచి వారు ప్రసవించిన రెండేళ్ల వరకు తల్లీబిడ్డల ఆరోగ్య స్థితిని మెరుగు పరిచే విధంగా వెయ్యి రోజులపాటు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. గర్భిణి దశలో పౌష్టికాహారం అందించడం వల్ల బిడ్డపెరుగుదల వేగవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మున్నా, ధనమ్మ, రామలక్ష్మీ, ముంతాజ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి

మార్కాపురం టౌన్: తల్లుల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని గజ్జలకొండ పీహెచ్‌సీ డాక్టర్ సాయిచరణ్‌తేజ పేర్కొన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రాయవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రక్తహీనత నివారణకు మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బరువు తక్కువగా ఉండేవారిని గుర్తించి ఎన్‌ఆర్‌సీకి పంపాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.లలితా సలోమి, సిబ్బంది విమల, సంధ్యారాణి, విజయకుమారి, వరలక్ష్మి, ఎలీసమ్మ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అర్బన్ సెంటరులో పోషకాహార లోపం నివారణ చర్యల గురించి సూపర్‌వైజర్ కె.రవికుమార్, మధుమతి, సరోజిని, పార్వతి వివరించారు. నిరంతర పర్యవేక్షణ ముందస్తు చర్యల ద్వారా పోషకాహార లోపాన్ని నివారించుకోవచ్చన్నారు.


మాట్లాడుతున్న సీడీపీఓ నీలోఫర్

పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం ఇవ్వాలి

కంభం: చిన్నతనం నుంచే పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అలవాటు చేయాలని ఎంపీడీఓ వీరభద్రాచారి పేర్కొన్నారు. కంభం–8 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా పక్షోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలను జంక్‌ఫుడ్ నుంచి దూరంగా ఉంచాలని, ఊబకాయానికి గురికాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సీడీపీఓ నీలోఫర్ మాట్లాడుతూ తల్లి గర్భం నుంచే పిల్లల ఎదుగుల ప్రారంభమవుతున్నందున తల్లులు జాగ్రత్తగా ఉండాలని, పౌష్టికాహారం ఆహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నాగచెంచులక్ష్మి, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

5 క్వింటాళ్ల పొగాకు చోరీ!


పొగాకు పోయినట్లు చూపుతున్న రైతు మహేష్‌రెడ్డి

తర్లుపాడు: అసలే కరువుతో పంటలు సరిగా పండక, గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతులు దొంగల బెడదతో మరింత మనోవేదనకు గురవుతున్నారు. గత నెలలో వ్యవసాయ మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలకొట్టి అందులో రాగివైరును చోరీ చేసిన దొంగలు తాజాగా రైతులు పండించిన పొగాకు దొంగిలించి వారిని ఆవేదనకు గురిచేశారు. గత శుక్రవారం మండలంలోని నాయుడుపల్లికి చెందిన మహేష్‌రెడ్డి అనే రైతు తాను పండించిన పొగాకును పొలంలో మండె వేయగా గుర్తుతెలియని వ్యక్తులు 5 క్వింటాళ్ల మేర దొంగిలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు. రైతుల సొమ్ము కాజేస్తున్న దొంగలను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

ఐవీఆర్‌ఎస్ సేవలపై అవగాహన


మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం: ప్రభుత్వం అందిస్తున్న ఐవీఆర్‌ఎస్ సేవలపై డిజిటల్ అసిస్టెంట్లు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ చిరంజీవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల, పట్టణంలోని 42 సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లకు ఐవీఆర్‌ఎస్ సర్వీసులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు, భూములకు సంబంధించిన అర్జీలు దాఖలు చేసే విధానాన్ని వివరించారు.

సబ్సిడీ పనిముట్ల లక్ష్యం పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

కంభం: రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తున్న పనిముట్ల టార్గెట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ సూచించారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం కంభం, అర్ధవీడు మండలాల వ్యవసాయ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఏవైనా దిద్దుబాట్లు ఉంటే వ్యవసాయ సహాయకుల ద్వారా ఏఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రైతు విశిష్ట సంఖ్యను ప్రతి రైతు కలిగి ఉండాలని, లేదంటే ఎటువంటి సంక్షేమ ఫలాలు అందవని స్పష్టం చేశారు. పంటలకు అవసరమైన ఎరువులను రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఓలు డి.స్వరూప, చంద్రశేఖర్, ఏఈఓ శివగంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులకు సంబంధించి కూలీలకు రోజుకు 300 రూపాయల వేతనం లభించేలా ఉపాధి సిబ్బంది కొలతలివ్వాలని ఆయన సూచించారు. ప్రతిరోజూ ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఫారం పాండ్స్, సోక్‌పిట్స్, క్యాటిల్ షెడ్లలో ప్రోగ్రెస్ పెంచాలన్నారు. ఉపాధి పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.